Follow: @ANNTELUGU
17-06-2026
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 166 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మహా ఎఫెక్ట్
### ఏపీఆర్ ప్రవీణ్స్‌కు షాక్
**ఎఫ్ టి ఎల్ లో నిర్మించిన ప్రహరీని కూల్చిన అధికారులు**
**ప్రొక్లయినర్‌తో ఆక్రమిత ప్రాంతం కూల్చిన అధికారులు**

**హైదరాబాద్, మహా:** ఏపీఆర్ ప్రవీణ్స్ బ్రాహ్మణపల్లి చెరువు వద్ద చేసిన ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులు కన్నెర్రచేశారు. నోటీసు జారీచేయడంతో పాటు చెరువు ఎఫ్ టిఎల్ కు సంబంధించిన కొంత భాగంలో నిర్మించిన ప్రహరీని తొలగించి షాకిచ్చారు. ప్రొక్లయినర్ ద్వారా గోడలు కూల్చేశారు. ఆరోపణలున్న ఆక్రమిత ప్రాంతంలోని గోడను, కట్టడాన్ని ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి తొలగించారు. ఏపీఆర్ ప్రవీణ్స్ బరితెగింపు మహా పత్రికలో ఈనెల 8న కథనం ప్రచురితం కాగా, నోటీసు జారీచేసిన ఇరిగేషన్ అధికారులు సోమవారం ఇందుకు సంబంధించిన ప్రహరీని కూల్చేశారు. చెరువు ఎఫ్ టి ఎల్‌ను ఆక్రమించి.. చేసిన అక్రమంపై మహాపత్రిక వెలుగులోకి తేగా, అధికారులు స్పందించడంతో ఆక్రమణలు కూలాయి. ఫలితంగా చెరువు ముంపు ఇళ్ళను ముంచకుండా అధికారులు సకాలంలో స్పందించినట్లయింది. ఇలాంటి ఆక్రమణలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించమని, భారీ వెంచర్లు నిర్మించే యాజమాన్యాలు చిన్నచిన్న తప్పులు చేసి ఇబ్బందిపడవద్దని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు. ఎవరు ఇలాంటి తప్పిదాలకు పాల్పడ్డా.. ఊరుకునే ప్రసక్తేలేదని, వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డేగకళ్ళతో నిఘా వేశామని ఇరిగేషన్ అధికారులు మహాకు తెలిపారు.

**టాప్ న్యూస్**

## నేడు వరంగల్ కు పవన్ కల్యాణ్
ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న బాలుడికి పరామర్శ 02



## తమిళనాడు రైతులకు రుణ మాఫీ
- సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- రూ. 75 వేల వరకు ఉన్న రైతులకు మాఫీ
- 14.43 లక్షల మంది రైతులకు లబ్ధి

03



## ట్రంప్ గౌరవార్థం రేవంత్ గిఫ్ట్
- జూన్ 23న డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ ప్రారంభం
- గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో రోడ్డుకు పేరు

02



# 30 కోట్ల మోసం...
# కొనుగోలుదారుల్లో ఆందోళన

## 'శ్రీకారం' రియల్ దందాపై మహా కథనాలు

నారాయణఖేడ్ లో ఫార్మ్‌ల్యాండ్ ముసుగులో కోట్ల వ్యాపారం
అక్రమ లేఅవుట్లపై అధికారుల మౌనం
రియల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్టేది?
"ఆయుష్మాన్‌భవ్', 'ఐకానిక్ హౌసింగ్'
వెంచర్ల అక్రమాలపై చర్యలకు రంగం సిద్ధం
"శ్రీకారం రియల్ ఎస్టేట్ సంస్థ
ఆర్థిక లావాదేవీలపై ఐటీ శాఖ నజర్
"ఫార్మ్‌ల్యాండ్ వెంచర్లపై కలెక్టర్ స్పందించాలంటున్న బాధితులు 02




నమ్మకమే పెట్టుబడిగా, అమాయక ప్రజల ఆశలే ఆసరాగా రియల్ ఎస్టేట్ రంగంలో కొందరు కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. 'శ్రీకారం రియల్ ఎస్టేట్' సంస్థ నారాయణ్‌ఖేడ్ రెవెన్యూ డివిజన్ సిర్గాపూర్ మండలం వాంగ్ధల్ గ్రామ పరిదిలో 'ఆయుష్మాన్‌భవ్', మనూర్ మండలం దావూర్ గ్రామ పరిదిలో 'శ్రీకారం ఐకానిక్ హౌసింగ్ ఫార్మ్స్' ఫార్మ్‌ల్యాండ్ వెంచర్ల పేరుతో చేస్తున్న వ్యాపారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. హెచ్ ఎమ్ డి ఏ, డీటీసీపీ అనుమతులు మచ్చుకైనా కనిపించవు. అయినా సరే, ఈ అక్రమ వెంచర్ల పేరిట సామాన్యులను బురిడీ కొట్టిస్తూ అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్టంలోని లొసుగులను వాడుకుంటూ, చట్టాన్ని అపహాస్యం చేస్తూ ప్లాట్లు కొనే కష్టమర్ల కష్టార్జితాన్ని నిలువునా దోచుకుంటున్నారు.

## సన్నవడ్ల విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి
### సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- విత్తనాల నుంచి కొనుగోళ్ల దాకా.. సమగ్ర కార్యాచరణకు అధికారుల ప్రత్యేక కమిటీ
- ఎరువుల కోసం కేంద్రంపై ఎప్పటికప్పుడు ఒత్తిడి
- ఎంపీలతో కలిసి కేంద్రం వద్దకు మంత్రుల టీం
- వ్యవసాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

02




## కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ
హైదరాబాద్ మెట్రో నిధులపై రిక్వెస్ట్ 03

## నేనెందుకు అడ్డుపడతా
రేవంత్ రెడ్డికి నేను జవాబుదారీ కాదు
అన్ని మెట్రోల్లాగే.. హైదరాబాద్ కు సహకరిస్తాం
కేంద్రమంత్రి కిషన్ రెడ్డి 02



## దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక నిషేధం
- నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం.
- జూన్ 22 వరకు సేవలు బంద్.. ప్లేస్టోర్ల నుంచి తొలగింపు.
- పేపర్ లీక్ వదంతులను అరికట్టేందుకే ఉక్కుపాదం.

02




## ఎటుచూసినా.. నోట్లకట్టలే
### నోట్ల కట్టలపైనే ఆ అధికారి నిద్ర
- రూ. 200 కోట్ల ఆస్తులు కూడబెట్టిన ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్
- సుంకరి నరహరి నివాసంతో పాటు 11 చోట్ల ఏకకాలంలో ఏసీబీ సోదాలు
- ఇంట్లో పట్టుబడ్డ రూ. 1.40 కోట్ల నగదు

02






## ఆరుట్లకు నేడు సీఎం రేవంత్ రెడ్డి


ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
తెలంగాణ విద్యారంగానికి ఆదర్శం 02






# ట్రంప్ గౌరవార్థం రేవంత్ గిఫ్ట్

- **జూన్ 23న డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ ప్రారంభం**
- **గచ్చిబౌలి ఫైనాన్షి యల్ డిస్ట్రిక్ట్ లో రోడ్డుకు పేరు**

**హైదరాబాద్, మహా :** భాగ్యనగరంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో డైనమిక్ నిర్ణయం తీసుకున్నారు. గ్లోబల్ ఐకాన్‌గా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఒక ప్రముఖ రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేయనున్నారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ప్రస్తుత 'యూఎస్ కాన్సులేట్ రోడ్డు'ను ఈ పేరుతో మార్చనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. జూన్ 23న ఈ రోడ్డును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్నారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం (జులై 4)కి ముందే జరగనున్న ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్, పలువురు ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, ఐటీ పరిశ్రమ ప్రముఖులు హాజరుకానున్నారు. తెలంగాణ ఐటీ రంగానికి, ఆర్థిక వృద్ధికి అమెరికా అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతగా, అలాగే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు గాను ట్రంప్ పేరును ప్రతిపాదిస్తూ గతంలో రేవంత్‌రెడ్డి చేసిన ఆలోచన ఇప్పుడు కార్యరూపం దాల్చింది.




# ఆరుట్లకు నేడు సీఎం రేవంత్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం జరగనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సరికొత్త విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టేలా ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. బుధవారం ఆరుట్లకు చేరుకోనున్న సీఎం... మొదటగా టీపీఎస్ ను ప్రారంభించనున్నారు. అనంతరం, పాఠశాలను సందర్శిస్తారు. తర్వాత, అల్పాహార పథకాన్ని ప్రారంభించి, విద్యార్థులతో కలిసి, బ్రేక్ ఫాస్ట్ చేయనున్నారు. అక్కడి నుంచి ప్రాథమిక పాఠశాల భవనం సందర్శించి, అక్కడి సౌకర్యాలు, క్రీడాప్రాంగణం, కంప్యూటర్ ల్యాబ్, తదితర సౌకర్యాలు పరిశీలించనున్నారు. 11గంటల తర్వాత బహిరంగసభకు హాజరుకానున్నారు.

**తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలిః ఎమ్మెల్యే మల్ రెడ్డి...**

పదేళ్ల విధ్వంసం తర్వాత 60ఏళ్ల ఆకాంక్షలకనుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ పునఃనిర్మాణం చేపట్టిందని, ఇందులో భాగంగా ఆరుట్ల నుంచి సరికొత్త విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు. నిన్నమొన్నటి వరకు ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూసిన వారే నేడు అడ్మిషన్ల కోసం వెంటబడే పరిస్థితి రావటమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. సర్కార్ సంకల్పంలో తల్లిదండ్రులంతా భాగస్వాములై రేపటి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ ప్రాజెక్టు ఇక్కడితో పూర్తికాలేదని.... విద్యార్థులందరికీ అత్యుత్తమ విద్యనందించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా పాఠశాలలను ప్రభుత్వం నిర్మించనుందని ఆకునూరి మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్థానిక నాయకులు కార్యకర్తలు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక నిషేధం.

ఢిల్లీ, మహా. : దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్‌యూజీ 2026 రీఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై భారత్‌లో తాత్కాలిక నిషేధం విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ సేవలు ఏమాత్రం అందుబాటులో ఉండవని స్పష్టం చేసింది. నీట్ పరీక్షల సమయంలో అక్రమాలకు పాల్పడే ముఠాలను అరికట్టడంతో పాటు, పేపర్ లీక్ వంటి తప్పుడు సమాచార వ్యాప్తికి చెక్ పెట్టే పకడ్బందీ చర్యల్లో భాగంగానే కేంద్రం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.
నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చేసిన అత్యవసర సిఫార్సుల మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్2000లోని సెక్షన్ 69ఏ కింద కేంద్రం ఈ నిషేధ ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ఫలితంగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్‌ను తక్షణమే తొలగించారు. అలాగే యాపిల్ యాప్ స్టోర్‌లో సైతం ఈ యాప్‌ను తాత్కాలికంగా అందుబాటులో లేకుండా చేయాలని ప్రభుత్వం టెక్ దిగ్గజాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మే 2026లో జరిగిన నీట్ పరీక్షలో భారీ ఎత్తున పేపర్ లీక్ ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణల నేపథ్యంలో జూన్ 21న ఎన్టీఏ పకడ్బందీగా రీఎగ్జామ్ నిర్వహిస్తోంది.
ఈ ప్రతిష్ఠాత్మక పరీక్ష సమయంలో పలు టెలిగ్రామ్ ఛానెళ్లు, గ్రూపుల ద్వారా చీటింగ్ ముఠాలు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఎన్టీఏ గుర్తించింది. అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని ఛానెళ్లను బ్లాక్ చేసినప్పటికీ సమస్య తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. దీంతో ఏకంగా టెలిగ్రామ్ యాప్‌పైనే దేశవ్యాప్త నిషేధానికి ఎన్టీఏ సిఫార్సు చేయగా, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ చర్యలు చేపట్టింది. యాప్ నిషేధంతో పాటుగా.. జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో ఉండే 'మెసేజ్ ఎడిటింగ్' ఫీచర్‌ను కూడా పూర్తిగా నిలిపివేయాలని కేంద్రం ఆదేశించింది. పాత మెసేజ్‌లను తమకు అనుకూలంగా ఎడిట్ చేస్తూ, పరీక్షకు ముందే పేపర్ లీక్ అయినట్లు కొందరు కృత్రిమ ఆధారాలు సృష్టిస్తున్న ఉదంతాలను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఈ మేరకు పకడ్బందీ చర్యలకు ఉపక్రమించింది.

# 30 కోట్ల మోసం... కొనుగోలుదారుల్లో ఆందోళన

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ :**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ సిర్గాపూర్, మనూర్ మండలాల పరిధిలో 'శ్రీకారం ఇన్ఫ్రా డెవెలపర్స్' 'ఆయుష్మాన్‌భవ్' ఐకానిక్ హౌసింగ్' సంస్థల పేరిట సాగుతున్న అక్రమ లేఅవుట్ల మాయాజాలం బట్టబయలయింది.ా పత్రికకు చిక్కిన బ్రోచర్ ప్రకారం.. 1 గుంట ప్లాట్ ధర రూ. 4,65,000, 2 గుంటల ప్రీమియం ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్ ధర రూ. 8,50,000 అంటూ వీరు ప్రచారానికి తెరలేపారు. కస్టమర్లను ఆకర్షించడానికి బ్రోచర్‌లో పొందుపరిచిన అంశాలన్నీ పచ్చి అబద్ధాలని క్షేత్రస్థాయి పరిశీలనలో తేటతెల్లమవుతోంది. వ్యవసాయ భూమిని నిబంధనల ప్రకారం మార్పిడి చేయకుండానే, బ్రోచర్‌లో మాత్రం 'నాలా కన్వర్షన్' అయిపోయినట్లు తప్పుడు ప్రకటన చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు.

**గ్రాఫిక్స్ చూపిస్తూ.. గాల్లో బిజినెస్**

'ది లగ్జరియా రిసార్ట్' పేరుతో గ్రాండ్ క్లబ్‌హౌస్, కాటేజీలు, స్విమ్మింగ్ పూల్ అంటూ లగ్జరీ కట్టడాల చిత్రాలను చూపించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు లేని అక్రమ ఫార్మ్‌ల్యాండ్ వెంచర్లలో ఇలాంటి పక్కా కట్టడాలకు ఆస్కారమే లేనప్పటికీ అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ప్లాట్లు కొనే కస్టమర్లకు రైతుబంధు, పీఎం కిసాన్, రైతుబీమా వర్తిస్తాయంటూ బ్రోచర్‌లో నమ్మబలుకుతున్నారు . వ్యవసాయ భూములను కమర్షియల్ వెంచర్లుగా మార్చి అమ్ముతున్న ఇలాంటి ప్లాట్లకు ఇవి వర్తించవని తెలిసినా కేవలం కస్టమర్లను ట్రాప్ చేయడానికే ఈ అబద్ధపు ప్రకటనలు గుప్పిస్తున్నారు.




ఎటువంటి అనుమతులు లేకుండా వందలాది ఎకరాల్లో వెంచర్లు వెలుస్తున్నా, సంబంధిత అధికారులు మౌనం వహించడం వెనుక భారీ స్థాయిలో చేతులు మారాయనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిమ్జ్ , బీదర్ ఎయిర్‌పోర్ట్, సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ వంటి పెద్ద ప్రాజెక్టుల చిత్రాలను బ్రోచర్‌లో చూపిస్తూ భవిష్యత్తులో కోట్ల లాభాలు వస్తాయంటూ



హైప్ క్రియేట్ చేస్తు కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు.'శ్రీకారం' రియల్ ఎస్టేట్ సంస్థ సాగిస్తున్న నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, 'ఆయుష్మాన్‌భవ్', 'ఐకానిక్ హౌసింగ్' వెంచర్ల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని బాధితులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సిర్గాపూర్ మండలం వాంగ్ధల్‌లో 100 ఎకరాల్లో లేఅవుట్ అనుమతులు లేకుండా ఒకచోట భూమి చూపి మరోచోట రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతంపై, అలాగే మనూర్ మండలం దవూర్‌లో డీటీసీపీ నిబంధనలను తుంగలో తొక్కి 'ఐకానిక్' పేరిట సాగుతున్న అక్రమ దందాపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని కోరుతున్నారు.

కనీస పర్మిషన్లు లేకుండా మాయమాటలతో సామాన్యుల నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన నేపథ్యంలో, 'శ్రీకారం' రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన అన్ని రకాల ఆర్థిక లావాదేవీలపై ఆదాయపన్ను శాఖ ప్రత్యేక దృష్టి సారించి లోతైన దర్యాప్తు చేపట్టాలని, ప్రభుత్వ ట్యాక్స్‌ల లూప్‌హోల్స్‌ను అరికట్టాలని మేధావులు పేర్కొంటున్నారు. వందలాది ఎకరాల్లో సాగుతున్న ఈ దందాకు సిర్గాపూర్, మనూర్ తహసీల్దార్ల మౌనమే రక్షణ కవచంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నందున, ఈ అక్రమ వెంచర్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేఅవుట్లను సీజ్ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మహాపత్రిక సాక్షిగా స్థానిక ప్రజలు, బాధితులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారుల గుట్టు రట్టు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ దారుణమైన దోపిడీపై జిల్లా అత్యున్నతాధికారి అయిన జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి కఠిన చర్యలకు ఉపక్రమించకపోతే.. వందలాది కుటుంబాల రోడ్డున పడతాయని బాధితులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


02 మహా పత్రిక
శ్రీకారం ఐకానిక్ మాయాజాలం
Aayushmanbhav Classic Farmland 100 ACRES ₹ 7,99,999 for 5 GUNTAS
Sreekaram's ICONIC HOUSING FARMS ₹8,50,000

రియల్ మాఫియా బరితెగింపు!

ఆయుష్మాన్‌భవ్, ఐకానిక్ హౌసింగ్ పేర్లతో రియల్ దందా

- రియల్ మాఫియాకు రెవిన్యూ అండ దండలు?
- కనీసం నోటీసుల్లేవు.. డీపీఓ చర్యలు శూన్యం!
- సిర్గాపూర్, మనూర్ తహసీల్దార్ల కనుసన్నల్లోనే అక్రమ రిజిస్ట్రేషన్ల పర్వం
- ఒక్కో దస్తావేజుకు రూ.10 వేల మామూళ్లు!
- నిబంధనలు బేఖాతర్.. అక్రమార్కులకు కాసుల పంట
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొడుతున్న 'రియల్' కేటుగాళ్లు!

# సన్నవడ్ల విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి



**ఎప్పటికపుడు కేంద్రానికి లేఖలు రాయాలి**

ఖరీఫ్ సీజన్ కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు ముఖ్యమంత్రి సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు అత్యధికంగా తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎరువుల పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, వాస్తవ పరిస్థితిని వివరించాలని సూచించారు. అవసరమైతే మంత్రులు, ఎంపీల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని చెప్పారు. మార్క్ ఫెడ్ నష్టాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వ్యాపారులకు తలొగ్గకుండా ఈ సారి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించిన కారణంగా మొక్క జొన్న కొనుగోళ్లతో వచ్చే నష్టం తగ్గించగలిగామని సీఎం వివరించారు. గతంలో రూ. 13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని.. ఈసారి దాదాపు రూ. 21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని చెప్పారు. ఆయిల్ ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభలదిశలో నడిపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు

హైదరాబాద్, మహా : రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసిఆర్ హెచ్‌ఆర్ డి లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి , వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
ధాన్యం కొనుగోళ్లలో ఇప్పటివరకు ఉన్న అనుభవాలు, రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలను సమీక్ష సమావేశంలో చర్చించారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్, ప్లానింగ్ విభాగం కార్యదర్శి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. విత్తనాల పంపిణీ మొదలు పంట వేసినప్పటి నుంచే అన్ని గ్రామాల్లో రైతుల పూర్తయ్యే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు ఈ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటుంది. ఏ రైతు ఏ పంట వేశాడు, ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలు కచ్చితంగా క్షేత్ర స్థాయి పరిశీలనతో నమోదు చేయాలని చెప్పారు. కనీస మద్దతు ధరలు, కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.
ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని చెప్పారు. రైతు వేదికల్లోనే సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి డేటా సేకరించాలని, ధాన్యం దిగుబడిపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. రైతు వేదికలను ఇకపై రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాల్లో వీటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ఆదేశించారు.
వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని, రైతులకు ఉపయోగంగా ఉంటే మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని అన్నారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యాప్ ద్వారా రైతులు బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. యూరియా పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు.

# ఎటుచూసినా.. నోట్లకట్టలే

**హైదరాబాద్, మహా :** ఐ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు.. గత కొన్ని నెలలుగా అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతున్న ఏసీబీ అధికారులు మరో పెద్ద తిమింగలాన్ని పట్టుకున్నారు. హైదరాబాద్ పాతబస్తీలో నివసిస్తున్న ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని వచ్చిన ఆరోపణలతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులకు భారీ మొత్తంలో నగలు, నగదు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభించాయి. మంగళవారం ఉదయం నుంచి సుంకరి నరహరి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. హైదరాబాద్ ఛత్రినాకలోని సుంకరి నరహరి ఇంటితోపాటు ఆయన కార్యాలయం, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లు ఇలా మొత్తం 11 ప్రాంతాల్లో ఒకే సమయంలో దాడులు చేశారు. ఈ క్రమంలోనే సుంకరి నరహరి ఇంట్లో ఆయన బెడ్రూంలో ఉన్న బెడ్డు కింద రూ.1.40 కోట్ల నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అదే విధంగా కేజీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే భారీ మొత్తంలో నగదును ఎందుకు ఉంచాల్సి వచ్చిందన్న అంశంపై ఏసీబీ అధికారులు శఅరీధర్ ను ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆయన ఇంట్లో దొరికిన బంగారు ఆభరణాలు, డబ్బు, రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నారు. సుంకరి నరహరితోపాటు ఆయన సోదరుడి ఇంట్లో భారీగా ఆస్తిపత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం



చేసుకున్నారు. హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లతోపాటు రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు విచారణలో వెల్లడైంది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్స్ ఈ సోదాలు చేపట్టాయి. ఈ క్రమంలోనే ఇప్పటివరకు దొరికిన ఆధారాల ప్రకారం ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఆస్తులు.. రూ.200 కోట్లకు పైనే ఉంటాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నరహరి నివాసంలో బ్యాంక్ డిపాజిట్లు (ఎఫ్‌డీ)లు కూడా దాదాపు రూ.కోటి వరకు ఉన్నాయని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వివరించారు. నరహరి పేరు మీద రెండు బ్యాంక్ లాకర్లు కూడా గుర్తించామన్నారు. వీటిని తనిఖీ చేసేందుకు అనుమతి కోసం బ్యాంకుకు లేఖ రాశామన్నారు. రెండు మూడు రోజుల్లో ఆ లాకర్లు ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం లెక్కల ప్రకారం నరహరి నివాసంలో ఇప్పటి వరకు గుర్తించిన ఆస్తులు విలువ రూ. 5 కోట్ల ఉంటుందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో ఈ ఆస్తులు విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుందని ఆయన వివరించారు. సోదాలు పూర్తయి, ఆస్తుల వివరాలపై కొంత స్పష్టత వచ్చిన తర్వాత నరహరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

**ఇటీవల డిప్యూటీ కలెక్టర్ నివాసాల్లో ఏసీబీ సోదాలు**

తెలంగాణ రెవెన్యూ శాఖలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కే. వంశీ మోహన్ ఇళ్లపై ఏసీబీ అధికారులు భారీ దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా హైదరాబాద్ సహా 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. గతంలో శేరిలింగంపల్లి ఆర్డీవోగా పనిచేసిన సమయంలో వంశీ మోహన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి వందల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. పిగ్లీపురంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి తన మామ పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం, మ్యుటేషన్ల కోసం రియల్టర్ల నుండి తన బంధువుల పేర్లపై 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్ల రూపంలో ముడుపులుగా తీసుకోవడం వంటి కీలక అక్రమాలను అధికారులు గుర్తించి, ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

# నేడు వరంగల్ కు పవన్ కల్యాణ్

**వరంగల్, మహా :** వరంగల్‌లో జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం పర్యటించనున్నారు. హనుమకొండలో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న బాలుడు నిరంజన్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉంది. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్హనుమకొండకు చెందిన నిరంజన్‌కు పదహారేళ్లు. చిన్నప్పుడు మామూలుగానే ఉండేవాడు. అయితే కానీ, 8 ఏళ్ల క్రితం అతడి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. జన్యుపరమైన డీఎండీ వ్యాధి బారిన పడి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఎదుగుదల పూర్తిగా లోపించింది. కాస్త గట్టిగా పట్టుకుంటే భరించలేని నొప్పి. ఇటీవల టీవీలో సీఎం రేవంత్ ఫుట్ బాల్ మ్యాచ్ చూసిన నిరంజన్ ఆయన్ను, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవాలనుందని తెలిపాడు. నిరంజన్ కోరికను జనసేన నేతలు, పవన్ అభిమానులు ఆయనకు వివరించారు. ఈ విజ్ఞప్తిని మన్నించిన పవన్ కల్యాణ్ నేడు హనుమకొండ వచ్చి నిరంజన్‌ను పరామర్శించనున్నారు. జనసేనాని టూర్ నేపథ్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అటు పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనుంది.

# నేనెందుకు అడ్డుపడతా

**ఢిల్లీ, మహా** మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలేనని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితువు పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తాము రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని వెల్లడించారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్రం సహకారం అందిస్తోందని, సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకరమవుతాన్నారు. అంతే తప్ప కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవన్నారు. తానెందుకు అడ్డుపడతానన్నారు. తమ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 50 ఏళ్లు వడ్డీ లేకుండా ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం ఇచ్చిందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని, ఎన్సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లను ఎన్సీడీసీ ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికే రూ.34 వేల కోట్లు ఎన్సీడీసీ తెలంగాణకు అందించిందని వెల్లడించారు.



# చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో ముమ్మర దర్యాప్తు

**దర్యాప్తుపై ఎస్పీ వికాస్ రాథోడ్ కీలక వ్యాఖ్యలు.**

**కాకినాడ, మహా :** కాకినాడ జిల్లా తుని గ్రామీణ ప్రాంతంలో సంచలనం సృష్టించిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) వికాస్ రాథోడ్ వెల్లడించారు. ఈ ఘటన వెనుక ఉన్న కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాథమిక విచారణలో చిన్నారిని అటవీ మృగాలు లాక్కెళ్లి ఉండవచ్చనే కోణం బలంగా వినిపిస్తున్నప్పటికీ, ఈ వాదనను నిర్ధారించడానికి ఇప్పటివరకు ఎలాంటి కచ్చితమైన ఆధారాలు లభించలేదని ఆయన స్పష్టం చేశారు.

ఈ మిస్సింగ్ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. పాపను అడవి జంతువులు ఎత్తుకెళ్లినట్లు గానీ, లేదా ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు గానీ ఏ కోణంలోనూ స్పష్టమైన, పక్కా ఆధారాలు దొరకలేదని ఎస్పీ వివరించారు. కేవలం ప్రాథమిక అనుమానాలే ఉన్నాయని, పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరమే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. అయితే, పాప అదృశ్యమైన రోజున కురిసిన భారీ వర్షం పోలీసుల దర్యాప్తుకు తీవ్ర ఆటంకం కలిగించింది. ఈ వర్షం కారణంగా ఘటనా స్థలంలో కీలకమైన ఆధారాలు చెరిగిపోవడంతో పాటు, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి జాడలు సేకరించడం కష్టంగా మారిందని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పాప ఆచూకీ కోసం గాలింపు చర్యలను మరింత వేగవంతం చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. జంతువుల సంచారం ఎక్కువగా ఉండే అటవీ ప్రాంత సరిహద్దులతో పాటు వ్యవసాయ పొలాల వెంబడి అణువణువూ జల్లెడ పడుతున్నారు. ఈ గాలింపు ఆపరేషన్‌లో స్థానిక అటవీ శాఖ అధికారుల సహకారాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటున్నారు. చిన్నారి ఆచూకీ ఇంకా తెలియక పోవడంతో తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వీలైనంత త్వరగా పాప జాడను కనుగొంటామని ఎస్పీ వికాస్ రాథోడ్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

# తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతంపై మీనాక్షి నటరాజన్ దృష్టి

**ఈనెల 21 నుంచి క్షేత్రస్థాయి పర్యటనలు.**

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో విస్తృత పర్యటనలకు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ అంశం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైన నేపథ్యంలో, పార్టీ సంస్థాగత వ్యవహారాలను చక్కదిద్దడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై ఆమె ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా అట్టడుగు స్థాయి నుంచి ఎన్నికల యంత్రాంగాన్ని పటిష్టం చేసే దిశగా కార్యాచరణను రూపొందించారు.

ఈ నెల 21వ తేదీ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి మీనాక్షి నటరాజన్ పలు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. పార్టీ కార్యక్రమాల పురోగతి, ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయి కార్యకలాపాలపై స్థానిక నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమీక్షలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాల్లో భాగంగా, బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్ఏలు) నిర్వహించే ప్రత్యేక శిక్షణా శిబిరాల్లో ఆమె స్వయంగా పాల్గొంటారు. ఓటరు జాబితాల పరిశీలన, ఎన్నికల నిర్వహణలో బీఎల్ఏల కీలక పాత్ర, బూత్ స్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు ఆమె దిశానిర్దేశం చేయనున్నారు.

పర్యటనల షెడ్యూల్ ప్రకారం జూన్ 21న మక్తల్ నియోజకవర్గంలో, జూన్ 23న ఆందోల్ నియోజకవర్గంలో ప్రత్యేక సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో టీపీసీసీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు కూడా పాల్గొని కార్యకర్తలకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. సంస్థాగత నిర్మాణం ప్రధాన లక్ష్యంగా సాగుతున్న ఈ పర్యటనలు, కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఇదిలా ఉండగా, మీనాక్షి నటరాజన్‌పై హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో దాఖలైన ఓ పిటిషన్‌ను న్యాయస్థానం ఇటీవల తిరస్కరించిన విషయం తెలిసిందే. ప్రజాప్రతినిధులకు సంబంధించిన కేసులను విచారించే ప్రత్యేక పరిధి తమకు లేదని స్పష్టం చేస్తూ, సదరు పిటిషన్‌ను కోర్టు పిటిషనర్‌కే వాపస్ చేయడం ప్రస్తుతం న్యాయ, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామాల నడుమ జరుగుతున్న ఆమె పర్యటనలు పార్టీ వర్గాల్లో మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# తమిళనాడు సీఎం విజయ్ సంచలన నిర్ణయం



**చెన్నై, మహా :** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన టీవీకే అధినేత విజయ్ పరిపాలనలో తనదైన ముద్ర వేసేందుకు సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్నదాతలకు భారీ ఊరటనిస్తూ సహకార రంగంలో రూ.75,000 వరకు వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 14.43 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుండగా, ప్రభుత్వ ఖజానాపై రూ.5,932.23 కోట్ల మేర అదనపు భారం పడనుంది. ముఖ్యమంత్రి విజయ్ మే 25న విడుదల చేసిన తొలి రుణమాఫీ ఉత్తర్వులపై రైతులు, విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. నాడు కేవలం రూ.50,000 వరకు మాత్రమే రుణమాఫీ ప్రకటించారు. అదీ కాకుండా లోన్ అమౌంట్ పెరిగే కొద్దీ మాఫీ మొత్తం తగ్గిపోతూ, రూ.1 లక్ష దాటిన వారికి కేవలం రూ.5,000 మాత్రమే ఫ్లాట్ వైవర్ ఇచ్చారు. ఇది టీవీకే ఎన్నికల మేనిఫెస్టోను వంచించడమేనని విపక్షాలు మండిపడ్డాయి. దీంతో వెనక్కి తగ్గిన సీఎం విజయ్, జూన్ 15న ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పాత నిబంధనలను పూర్తిగా రద్దు చేస్తూ సరికొత్త సవరించిన ప్యాకేజీని ప్రకటించారు.

**తాజా జీవోలోని ముఖ్యాంశాలు..**

**అందరికీ వర్తింపు**

తాజా సవరణ ప్రకారం ల్యాండ్ హోల్డింగ్స్ లేదా సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా.. చిన్న, మధ్యరక, పెద్ద రైతులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. సహకార బ్యాంకుల్లో రూ.75,000 లేదా అంతకంటే తక్కువ క్రాప్ లోన్ ఉన్న ప్రతి రైతుకు 100 శాతం పూర్తి రుణమాఫీ లభిస్తుంది. ఒకవేళ రుణం అంతకంటే ఎక్కువగా ఉంటే, వారికి ఒకే మొత్తంగా రూ. 35,000 ఫ్లాట్ రుణమాఫీ వర్తింపజేస్తారు. మే 1, 2025 నుండి ఫిబ్రవరి 28, 2026 మధ్య కాలంలో సహకార బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలకు మాత్రమే ఈ ఊరట లభించనుంది.

**నిధుల సర్దుబాటు ఎలా?**

గతంలో ప్రకటించిన రూ.50,000 పరిమితి వల్ల ప్రభుత్వానికి కేవలం రూ.2,044 కోట్ల ఖర్చు మాత్రమే వచ్చేది. కానీ ఇప్పుడు పరిమితిని రూ.75,000 కి పెంచడం, పెద్ద రైతులకు కూడా రూ.35,000 చొప్పున రాయితీ ఇవ్వడం వల్ల ప్రభుత్వ బడ్జెట్‌పై ఏకంగా రూ.5,932.23 కోట్లు భారం పడనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం.. ఇలాంటి ప్రభుత్వ రుణమాఫీ నిధులను 45 నుండి 60 రోజుల్లోగా సహకార బ్యాంకులకు ప్రభుత్వం పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం విజయ్ స్పష్టం చేశారు.

**విపక్షాల విమర్శలు..**

ఈ నిర్ణయంపై అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి స్పందిస్తూ.. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు పూర్తి రుణమాఫీ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం రూ.75,000 కు పరిమితం చేయడం సరికాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతులకు రుణ మాఫీ చేయాలని పళనిస్వామిడిమాండ్ చేశారు.

## చిన్న కాంట్రాక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చలు సఫలం

**హైదరాబాద్, మహా.** రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం వేసిన అడుగులు సత్ఫలితాలను ఇచ్చాయి. పెండింగ్ బిల్లుల సాధన కోసం ఆందోళన బాటపట్టిన చిన్న కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఈ కీలక సమావేశంలో కాంట్రాక్టర్ల సమస్యలపై, ప్రధానంగా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెండింగ్ బిల్లుల చెల్లింపుల అంశంపై ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం అత్యంత సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ చిన్న కాంట్రాక్టర్లకు అండగా ఉంటుందని, పెండింగ్ బిల్లుల మొత్తాన్ని దశలవారీగా విడుదల చేసి వారి ఇబ్బందులను పరిష్కరిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి భరోసాతో కాంట్రాక్టర్లలో ఆశావహ వాతావరణం నెలకొంది.

# జీ7 సదస్సులో ప్రధాని మోదీ

**ఇవియాన్ (ఫ్రాన్స్):మహా:** ఫ్రాన్స్‌లోని ఇవియాన్ నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'కు హాజరైన ఆయన.. ప్రపంచ దేశాల అధినేతలతో కలిసి ప్రస్తుత భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిణామాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ఎంతో ఆత్మీయంగా ప్రత్యేక చర్చలు జరపడం అంతర్జాతీయ దౌత్య వర్గాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**రష్యా ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టేలా ట్రంప్ సంచలన ప్రకటన**

ఈ సదస్సు వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక అంతర్జాతీయ సంచలన ప్రకటన చేశారు. రష్యా నుంచి సరఫరా అయ్యే చమురుపై అమెరికా త్వరలోనే మళ్లీ కఠినమైన ఆంక్షలు విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన శాంతి ఒప్పందం కారణంగా ప్రపంచంలోనే అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి (Strait of Hormuz) గుండా అంతర్జాతీయ చమురు సరఫరా ఇప్పుడు ఎంతో సులభతరమైందని ట్రంప్ వివరించారు. ఈ సానుకూల పరిణామం వల్ల ప్రపంచ ఇంధన మార్కెట్‌లో రష్యాపై మరింత కఠినమైన ఆర్థిక చర్యలు తీసుకునే వెసులుబాటు తమకు కలిగిందన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న దాడుల నేపథ్యంలో మాస్కోపై అంతర్జాతీయ ఆర్థిక ఒత్తిడిని గరిష్ట స్థాయికి పెంచేందుకు జీ7 దేశాలు సరికొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**ప్రపంచ సవాళ్ల పరిష్కారమే 'ఔట్‌రీచ్' లక్ష్యం**

సాధారణంగా జీ7 కూటమిలోని సభ్య దేశాలు (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, కెనడా, జపాన్), తాము ప్రత్యేకంగా ఆహ్వానించిన భారతదేశం వంటి ఇతర శక్తిమంతమైన దేశాల అధినేతలతో పాటు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కలుపుకుని ఈ ప్రతిష్టాత్మక 'ఔట్‌రీచ్ సెషన్'ను నిర్వహిస్తాయి. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన ఆర్థిక సంక్షోభాలు, ఇంధన కొరత, భద్రతాపరమైన సవాళ్లపై విస్తృతంగా చర్చించి ఉమ్మడి పరిష్కార మార్గాలను అన్వేషించడమే ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ క్రమంలోనే ప్రపంచ శాంతి, అంతర్జాతీయ వాణిజ్య భద్రతను కాపాడటంలో భారతదేశం పాత్ర ఎంతో కీలకమని జీ7 వేదికగా మరోసారి వ్యక్తమైంది




# కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ

**హైదరాబాద్ మెట్రో నిధులపై రిక్వెస్ట్**



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ఆమోదించిన రుణాన్ని వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు ఓ బహిరంగ లేఖ రాస్తూ.. మెట్రో నిధుల మంజూరులో జరుగుతున్న ఆలస్యాన్ని ప్రస్తావించారు. మెట్రో ప్రాజెక్టు కోసం ఐఆర్ ఎఫ్ సీ నుంచి జూన్ 15న నిధులు విడుదల కావాల్సి ఉందని, కానీ ఇప్పటి వరకు ఆ రుణం మంజూరు కాలేదని సీఎం లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద ఇప్పటికే రూ.1,451 కోట్ల ఈక్విటీని చెల్లించిందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను నెరవేర్చినందున, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను కూడా సకాలంలో ఇప్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మాట్లాడి, నిలిచిపోయిన మెట్రో రుణాన్ని వెంటనే విడుదలయ్యేలా చూడాలని కోరారు.

# పిప్రిలో ఎంపీ ధర్మపురి అరవింద్ పర్యటన

**'బాధిత కుటుంబానికి పరామర్శ, సంచలన వ్యాఖ్యలు.**

**ఆర్మూర్,మహా:** ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న గృహ దహనం ఘటనపై జిల్లా పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) ధర్మపురి అరవింద్ తీవ్ర స్థాయిలో స్పందించారు. పది రోజుల క్రితం అప్పుగా ఇచ్చిన డబ్బును తిరిగి అడిగిన పాపానికి రాజమల్లు అనే వ్యక్తి ఇంటికి దుండగులు నిప్పుపెట్టి దగ్ధం చేసిన విషయం తెలిసిందే. మంగళవారం పిప్రి గ్రామానికి చేరుకున్న ఎంపీ అరవింద్, కాలిపోయిన ఆ ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కష్టకాలంలో వారికి అండగా నిలుస్తూ, తన వంతుగా *రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని* ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. పదివేల హిందూ కుటుంబాలు ఉన్న గ్రామంలో కేవలం పది కుటుంబాలుగా ఉన్న ముస్లింలు ఇంతటి అరాచకానికి పాల్పడటంపై ఆయన మండిపడ్డారు. కుటుంబ సభ్యులంతా లోపల ఉండగానే, దారుణంగా ఇంట్లోకి పెట్రోల్ తీసుకువచ్చి నిప్పు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ అమానుషానికి ఒడిగట్టిన నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందువులంతా ఏకం కాకపోతే భవిష్యత్తులో పిప్రి గ్రామం కూడా మరో బెంగాల్‌లా మారుతుందని ఆయన హెచ్చరించారు.ఇదే సమయంలో గ్రామ అభివృద్ధి కమిటీ వ్యవహరించిన తీరుపై ఎంపీ అరవింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు సుమారు రూ. 25 లక్షల మేర ఆస్తి నష్టం జరిగితే, కమిటీ సభ్యులు కేవలం రూ. 13 లక్షలు మాత్రమే పరిహారంగా ఎలా ఇప్పిస్తారని ఆయన నిలదీశారు. ఇలాంటి దారుణాలకు పాల్పడే వారిని గ్రామం నుంచి పంపించకుండా ఇంకా ఊరిలోనే కొనసాగించడం హిందువులకు ఏమాత్రం శ్రేయస్కరం కాదని వ్యాఖ్యానించారు. వారిని అలాగే అక్కున చేర్చుకుంటే గ్రామాన్ని మరో బెంగాల్‌గా మారుస్తారని ఆయన అన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల,మహా :** గ్రామస్థాయి నుండి అభివృద్ధి దిశగా నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ శిక్షణలో 16వ ఆర్థిక సంఘం నిబంధనలు, పెసా గ్రామపంచాయతీలు, సభాసర్ ,నిర్ణయ్ యాప్, ఈ గ్రామ స్వరాజ్ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు.

అత్యుత్తమ ర్యాంకింగ్ వచ్చేలా గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని, పంచాయతీ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరు కావాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, గ్రామసభలు నిర్వహించి గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, పన్నులు సకాలంలో వసూలు చేయాలని వివరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యాలయ భవనం ఉండాలని, ఇందుకు గాను భవనాలు లేని పంచాయితీలలో అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. గ్రామాల పరిధిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టే విధంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని, ఈ నేపథ్యంలో నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

కార్యక్రమంలో సి.జి.జి. కన్సల్టెంట్ మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మన 'కారం'పై కన్నేసిన డ్రాగన్

- దేశీయ మిర్చిపై అంతర్జాతీయ కుట్ర!
- లోపాయికారీ ముఠాలతో విత్తనాల చౌర్యం
- పురుగుమందుల సాకుతో చైనా దగా
- జెమినీ వైరస్ వెనుక బయో-వార్ కోణం?
- కఠిన చర్యలు కోరుతున్న అన్నదాతలు.



**హైదరాబాద్, మహా:** ఖమ్మం, గుంటూరు, ప్రకాశం.. ఈ పేర్లు వినగానే ప్రపంచ దేశాలకు ఘాటైన, నాణ్యమైన మిర్చి గుర్తుకొస్తుంది. ముఖ్యంగా చైనా వంటి దేశాలకు మన మిర్చి లేనిదే పూట గడవని పరిస్థితి. దశాబ్దాలుగా అంతర్జాతీయ మార్కెట్లో రారాజుగా వెలుగొందుతున్న భారతీయ మిర్చిపై ఇప్పుడు ఓ భారీ అంతర్జాతీయ కుట్ర జరుగుతోందన్న సంచలన నిజాలు వెలుగుచూస్తున్నాయి. మన దేశ సంపదను దొడ్డిదారిన తరలిస్తూ, ఆరుగాలం శ్రమించే మన రైతులకు తీరని ద్రోహం చేస్తున్న డ్రాగన్ దేశం ఎత్తుగడలు, లోపాయికారీ ముఠాల దందా ఇప్పుడు వ్యవసాయ, వాణిజ్య వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.

**విత్తనాల చౌర్యం.. వ్యవస్థల్లోని నల్లగొర్రెల దందా**

గత కొన్నేళ్లుగా భారతదేశానికి చెందిన అత్యంత విలువైన, అధిక దిగుబడినిచ్చే మిరప విత్తనాలు చైనాకు అడ్డదారిలో స్మగ్లింగ్ అవుతున్నాయి. దొంగిలించిన మన విత్తనాలతోనే తమ దేశంలో మిర్చిని పండించి, అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశానికే పోటీగా నిలబెట్టాలనేది చైనా కుట్రపూరిత వ్యూహం. ఈ దందాను వెనకుండి నడిపిస్తున్న కొన్ని స్వార్థపూరిత శక్తులు, 'కమ్మీ ముఠాలు' ఇంకా కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనే పాతుకుపోయి ఉండటం అత్యంత శోచనీయం. ప్రభుత్వ ఉద్యోగుల ముసుగులో దేశద్రోహానికి పాల్పడుతున్న ఈ నల్లగొర్రెలు, మన రైతుల కడుపుకొడుతూ చైనాకు లాభాలు చేకూరుస్తున్నారు.

**క్వాలిటీ పేరుతో సరికొత్త డ్రామా**

ఖమ్మం, గుంటూరు మార్కెట్ల నుండి ఏటా వందల కోట్ల రూపాయల విలువైన మిర్చిని కొనుగోలు చేసే చైనా, ఇప్పుడు హఠాత్తుగా ప్లేట్ మార్చింది. "క్వాలిటీ లేదు" అనే సాకుతో భారతీయ మిర్చి లోడింగులను వరుసగా తిరస్కరిస్తోంది. దీని వెనుక ఉన్నది నాణ్యతా లోపం కాదు, అదో పెద్ద అంతర్జాతీయ కుట్ర. మన ఉత్పత్తుల నాణ్యతను ప్రపంచం ముందు తక్కువ చేసి చూపి, అంతర్జాతీయ మార్కెట్లో "భారతీయ మిర్చి" బ్రాండ్ ఇమేజ్‌ను మసకబార్చడమే డ్రాగన్ అసలు ప్లాన్. తద్వారా డిమాండ్‌ను, ధరలను అమాంతం పడగొట్టి మన రైతుల నడ్డి విరవాలని ఆ దేశం కుతంత్రాలు పన్నుతోంది. ఇక్కడ తేలాల్సిన అతి ముఖ్యమైన విషయం ఒకటుంది. చైనా తిరస్కరించిన ఆ మిర్చి నాణ్యంగానే ఉందని, ఎగుమతికి అర్హమైనదేనని భారత ప్రభుత్వం పేరుతో తొలుత "క్వాలిటీ క్లియరెన్స్" ఇచ్చిన అధికారులు ఎవరు? ఒకవేళ నిజంగానే నాణ్యత లేకపోతే సర్టిఫికెట్ ఎలా ఇచ్చారు? వ్యవస్థలోని కొందరు లంచగొండి అధికారులు చైనా ఏజెంట్లతో చేతులు కలిపి ఈ డ్రామా ఆడుతున్నారా అన్న కోణంలో సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

**రైతును కాపాడుకుందాం.. దేశ బ్రాండ్‌ను నిలబెట్టుకుందాం**

ఇది కేవలం రెండు దేశాల మధ్య జరిగే సాధారణ మిర్చి వ్యాపారానికి సంబంధించిన వివాదం కాదు. ఇది మన దేశ ఆహార భద్రత, అన్నదాతల ఆరుగాలపు శ్రమ, భారత ఆర్థిక వ్యవస్థపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, జాతీయ నిఘా సంస్థలు మేల్కొనాలి. విదేశీ ముఠాలతో చేతులు కలిపిన మన మంత్రిత్వ శాఖల్లోని నల్లగొర్రెలను, చైనా ఏజెంట్లను ఏరిపారేయాలి. కఠినమైన చట్టపరమైన చర్యల ద్వారా దోషులను శిక్షించినప్పుడే.. మన రైతుల కన్నీరు తుడుచుకోగలం, అంతర్జాతీయ స్థాయిలో భారతీయ మిర్చి బ్రాండ్‌ను సగర్వంగా నిలబెట్టుకోగలం.

**జెమిని వైరస్ వెనుక బయో-వార్ కోణం?**

కొన్నేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లోని ఖమ్మం, గుంటూరు, ప్రకాశం తదితర ప్రాంతాలలో మిరప పంటను సర్వనాశనం చేసిన "జెమిని వైరస్" తీవ్రతను రైతాంగం ఇంకా మర్చిపోలేదు. వేలాది ఎకరాల్లో పంట తుడిచిపెట్టుకుపోయి, రైతులు కోట్లలో నష్టపోయి అప్పుల పాలయ్యారు. అయితే, మన దేశీయ మిర్చి మార్కెట్‌ను కోలుకోకుండా చేయడానికి విదేశీ ల్యాబ్‌ల నుండి ఉద్దేశపూర్వకంగానే ఈ వైరస్‌ను వ్యాప్తి చేశారా అనే బలమైన అనుమానాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. మిర్చి మార్కెట్‌పై గుత్తాధిపత్యం కోసం జరిగిన ఈ 'బయోవార్' కోణంపై జాతీయ భద్రతా సంస్థలు లోతైన దర్యాప్తు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**పురుగుమందుల వాడకం.. వాస్తవాలు వర్సెస్ చైనా దుష్ప్రచారం**

మన మిర్చిలో రసాయనాలు ఎక్కువగా ఉన్నాయని గగ్గోలు పెడుతున్న చైనా వాదనల్లో ఎలాంటి పసాలేదని అంతర్జాతీయ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాగవుతున్న పంటల విస్తీర్ణాన్ని, వాడుతున్న పురుగుమందుల పరిమాణాన్ని పరిశీలిస్తే.. భారతీయ రైతులు వాడే రసాయనాల సగటు చాలా తక్కువ. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ , కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం... భారతదేశంలో హెక్టారుకు సగటున కేవలం 0.5 నుంచి 0.6 కిలోల (ఎకరానికి సుమారు 200 గ్రాములు) పురుగుమందులు మాత్రమే వాడుతున్నారు. ప్రపంచ సగటు హెక్టారుకు 2.4 కిలోలుగా (ఎకరానికి 970 గ్రాములు) ఉంది. కానీ, "క్వాలిటీ" గురించి నీతులు చెబుతున్న చైనా.. హెక్టారుకు ఏకంగా 13 కిలోల (ఎకరానికి 5.2 కిలోలు) మేర రసాయనాలను గుప్పిస్తోంది.

మన దేశంలో పంజాబ్, తెలంగాణ, ఏపీ వంటి రాష్ట్రాల్లో గరిష్టంగా వాడినా అది హెక్టారుకు 4 కిలోల లోపే ఉంటుంది. చైనా తక్కువ భూమిలో అత్యధిక దిగుబడి సాధించడం కోసం విపరీతంగా రసాయన ఎరువులను, పురుగుమందులను, కలుపు మందులను వాడుతోంది. మరోవైపు భారతీయ రైతులు ఇప్పటికీ సేంద్రియ ఎరువులు, వేపనూనె వంటి సహజసిద్ధమైన పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మనకంటే 20 రెట్లకు పైగా ఎక్కువ పురుగుమందులను వాడే చైనా.. మన ఉత్పత్తులపై నిందలు వేయడం ముమ్మాటికీ వాణిజ్య కుట్రేనని స్పష్టమవుతోంది.



# బై బై చికాగో

హీరో, హీరోయిన్లు షూటింగ్స్‌తో ఎంత బిజీగా ఉంటారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఓ వైపు షూటింగ్స్, మరోవైపు ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా ఉంటుంటారు. షూటింగ్స్‌కి ఏ మాత్రం విరామం దొరికినా చాలు సేద తీరేందుకు విదేశాల్లో వాలిపోతుంటారు. కుటుంబ సభ్యులతోనో, స్నేహితులనో వెకేషన్ ప్లాన్ చేస్తుంటారు. తమకు ఇష్టమైన ప్రదేశానికి వెళ్లి సరదాగా ఎంజాయ్ చేస్తుంటారు.

తమ అనుభూతులను, మధురమైన జ్ఞాపకాలను అభిమానుల కోసం సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ కూడా తాజాగా చికాగో వెకేషన్‌ని పూర్తి చేశారు. వరుణ్ ధావన్ హీరోగా మృణాళ్ ఠాకూర్, పూజా హెగ్డే హీరోయిన్లుగా డేవిడ్ ధావన్ తెరకెక్కించిన చిత్రం 'హై జవానీతో ఇష్క్ హోనా హై'. ఈ నెల 5న ఈ మూవీ విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా పాల్గొన్నారు మృణాళ్.


ఈ మూవీ రిలీజ్ తర్వాత వెకేషన్ కోసం చికాగో వెళ్లారామె. అక్కడ తనదైన శైలిలో సందడి చేసిన ఈ బ్యూటీ తిరిగి ఇండియాకి బయలుదేరారు. ఈ నేపథ్యంలో "బ్యాగులు మొత్తం సర్దేశాను.. చికాగో సిటీని వదిలే సమయం వచ్చింది. నిజం చెప్పా లంటే ప్రాణం పోతున్నట్టుగా ఉంది" అంటూ ఓ ఎమోషనల్ ఎమోజీతో పాటు తన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారామె. ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

# కొత్త తరహా పాత్రలో కనిపించబోతున్నాను: సునీల్



"'ఇసాకపట్నం' సిరీస్ చాలా వాస్తవంగా ఉంటుంది. ప్రతి పాత్రకు వారి సొంత లక్ష్యాలు, సంఘర్షణలు ఉంటాయి. ఈ సిరీస్‌లో నేను ఇప్పటి వరకు చేయని కొత్త తరహా పాత్రలో కనిపించబోతున్నాను" అని సునీల్ పేర్కొన్నారు. ఐశ్వర్యా రాజేష్, సముద్రఖని ప్రధాన పాత్రల్లో, సునీల్, నరేష్ అగస్త్య, రాజీవ్ కనకాల, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమాకుల ఇతర పాత్రలు పోషించిన వెబ్ సిరీస్ 'ఇసాకపట్నం'. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించారు. తమడా మీడియా ప్రొడక్షన్స్ పై రాహుల్ తమడా, సెదీప్ రెడ్డి బొర్రా నిర్మించారు. అమెజాన్ ప్రైమ్ వీడియో తెలుగు ఒరిజినల్ వెబ్ సిరీస్‌గా రూ పొందిన ఈ సిరీస్ జూలై 2 నుంచి తెలుగుతో పాటు తమిళ్, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇసాకపట్నం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఐశ్వర్యా రాజేష్ మాట్లాడుతూ–"పవర్, సంఘర్షణతో నిండిన ప్రపంచంలో ధైర్యం, బలహీనత, ఆత్మవిశ్వాసంతో తనదైన నిర్ణయాలతో ముందుకు సాగే పాత్ర నాది.ఈ పాత్రను పోషించడం ప్రత్యేకమైన అనుభవం" అని చెప్పారు. "'ఇసాకపట్నం' ఒక కల్పిత ప్రపంచంలో సాగే కథ అయినప్పటికీ పాత్రలు, వారి భావోద్వేగాలు చాలా నిజాయితీగా ఉంటాయి" అని గ్యారీ బీహెచ్ తెలిపారు. "ఆశ, ప్రతీకారం, అధికారం కోసం మనుషులు ఎంత దూరమైనా వెళతారనే విషయాన్ని ఈ కథ బలంగా చెబుతుంది" అన్నారు సముద్రఖని. నటులు నరేష్ అగస్త్య, మెరిన్ ఫిలిప్ మాట్లాడారు.

# కుబేర నటి బ్రేకప్.. ప్రియుడి ఫోటోలు డిలీట్



ప్రస్తుత రోజుల్లో డేటింగ్, బ్రేకప్స్ చాలా సర్వసాధారణమైపోయాయి. ఇది సినీ రంగంలో కాస్తా ఎక్కువే. తాజాగా మరో నటి బ్రేకప్ చేసుకున్నట్లు తెలుస్తోంది. తెలుగులో కుమార్ వర్సెస్ కుమారి అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ సునయన.. ఆ తర్వాత పలు సినిమాలు చేసింది. అయితే ఆమె తన ప్రియుడితో విడిపోయినట్లు సమాచారం. కాగా.. యునైటెడ్ అరబ్ ఎయిర్లైట్స్‌కు చెందిన కఖలిత్ అల్ అమెరికా అనే వ్యక్తి ప్రేమలో పడిన సునయన.. వీరి ప్రేమ వ్యవహారం నిశ్చితార్థం వరకు కూడా వెళ్లింది. తాజాగా వీరిద్దరి రిలేషన్‌కు ఎండ్ కార్డ్ పడినట్లేనని అర్థమవుతోంది. ఆమె తన ప్రియుడితో ఉన్న ఫోటోలను ఇన్‌స్టా నుంచి డిలీట్ చేసింది. దీంతో బ్రేకప్ వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే ఈ వ్యవహారంపై సునయన గానీ.. ఆమె ప్రియుడు గాని స్పందించకపోవడం గమనార్హం. కాగా.. నాగ్‌పూర్‌కు చెందిన సునయన ఎల్లా మోడల్‌గా తన కెరీర్ ప్రారంభించింది. 2005లో తెలుగులో కుమార్ వర్సెస్ కుమారి అనే చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మలయాళం, కన్నడ చిత్రాల్లో అవకాశాలొచ్చాయి. అదేవిధంగా కాదలిల్ విళిందేన్ అనే చిత్రంతో తమిళంలోనూ అడుగుపెట్టింది. ధనుశ్, నాగార్జున నటించిన కుబేర మూవీలోనూ మెరిసింది. తమిళంలో మాసిలామణి ,వంశం, నీర్ పారైవ, సమర్ వంటి పలు చిత్రాల్లో నటించారు.



# డిసెంబరులో...

ప్రభాస్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ లవ్‌స్టోరీ మూవీ 'ఫౌజి'. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే ఈ సినిమా కథలో బ్రిటిష్ సోల్జర్ పాత్రలో ప్రభాస్ నటిస్తున్నారని తెలిసింది. ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భానుచందర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా 'ఫౌజి' సినిమాను దసరా సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ సినిమా చిత్రీకరణ ఇంకా పూర్తి కాని నేపథ్యంలో దసరాకు రిలీజ్ కావడం లేదని తెలిసింది. డిసెంబరు మొదటి వారంలో రిలీజ్ చేయాలని ప్రభాస్ అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. అంతేకాదు.. ఈ చిత్రంలో దేశభక్తి అంశాలు ఉండటంతో ఆగస్టు 15కి 'ఫౌజి' టీజర్‌ను రిలీజ్ చేసే ఆలోచనలో చిత్ర యూనిట్ ఉందట.మరి.. 'ఫౌజి' డిసెంబరులోనే థియేటర్స్‌కు వస్తుందా? అనే విషయంపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. ఇదిలా ఉంటే... ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్' మూవీ చిత్రీకరణతో బిజీగా ఉన్నారని తెలిసింది. త్వరలోనే నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో 'కల్కి 2' చిత్రీకరణలో పాల్గొంటారు. 'స్పిరిట్' సినిమా 2027 మార్చి 5న రిలీజ్ కానుంది. 'కల్కి 2' రిలీజ్ డేట్‌పై స్పష్టత రావడానికి మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

# మరో స్టార్ పొలిటికల్ ఎంట్రీ.. క్యూ కడుతున్నారుగా..!



కోలీవుడ్ స్టార్స్ సినిమాలతో పాటు పాలిటిక్స్ వైపు దూసుకెళ్తున్నారు. తమిళనాట కొత్త పార్టీ పెట్టిన దళపతి విజయ్ ఎన్నికల్లో పోటీ చేసిన తొలిసారే సీఎం అయ్యారు. అదే స్ఫూర్తితో రాఘవ లారెన్స్ సైతం రాజకీయాల్లోకి వచ్చే అవకాశముందని క్లారిటీ ఇచ్చేశారు. ఎప్పుడనేది మాత్రం సస్పెన్స్ కొనసాగించారు. విజయ్ పార్టీలో చేరతారా? లేదా అన్నదానిపై రాబోయే రోజుల్లో తెలియనుంది. ఇదిలా ఉండగానే మరో స్టార్ పొలిటికల్ ఎంట్రీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. హీరోగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎదిగిన జీవీ ప్రకాశ్ కుమార్ రాజకీయాల్లోకి రావడంపై క్లారిటీ ఇచ్చారు. సినీ ప్రయాణం ఇంకో 15 ఏళ్లు కొనసాగుతుందో లేదో చెప్పలేనని జీవీ ప్రకాశ్ అన్నారు. ఆ తర్వాత తాను ప్రజాసేవపైనే దృష్టి పెడతానని కీలక వ్యాఖ్యలు చేశారు. నా ఆలోచనలకు సరిపోయే వేదిక దొరికితే కలిసి పనిచేయడానికి సిద్ధమని తెలిపారు. ఈ ప్రకటనతో భవిష్యత్తులో తాను రాజకీయాల్లోకి రావడం ఖాయమని హింట్ ఇచ్చారు జీవీ ప్రకాశ్. తాజా ఇంటర్వ్యూలో ఈ కామెంట్స్ చేశారు. ఇటీవలే రాఘవ లారన్స్, రజినీకాంత్ అల్లుడు లాంటి వాళ్లు రాజకీయాల్లోకి వస్తున్నారని వార్తలొచ్చాయి. లారెన్స్ ఇప్పటికే ఎంట్రీపై క్లారిటీ ఇచ్చాడు. తాజాగా మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ సైతం తన పొలిటికల్ ఎంట్రీ సంకేతాలిచ్చారు. ఇదంతా చూస్తుంటే కోలీవుడ్ ఇండస్ట్రీ సినిమాల కంటే ఎక్కువగా రాజకీయాల వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో సినీ ఇండస్ట్రీ.. తమిళనాట రాజకీయాలను శాసించనుందా? అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పెద్ది కొత్త వర్షన్.. థియేటర్లలో ఎప్పుడంటే?



రామ్ చరణ్ హీరోగా వచ్చిన రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ మూవీ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. తొలి రోజే పాజిటివ్ టాక్ అందుకున్న ఈ సినిమా రూ.400 కోట్ల మార్క్ దిశగా దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించింది. అయితే ఆమె రోల్ అచియ్యమ్మ పాత్రపై విమర్శలొచ్చాయి. జాన్వీ కపూర్ సీన్స్ అభ్యంతరకరంగా ఉన్నాయని విమర్శించారు. దీంతో జాన్వీ కపూర్‌పై సన్నివేశాలపై డైరెక్టర్ బుచ్చిబాబు క్షమాపణలు కూడా చెప్పారు. ఆ తర్వాత ఆ సీన్‌స్‌ను మూవీ నుంచి తొలగించారు. అయితే జాన్వీ కపూర్ సీన్స్ తొలగించిన పెద్ది మేకర్స్ మరి కొన్ని సన్నివేశాలను యాడ్ చేశారు. కొత్త వర్షన్‌లో జాన్వీ కపూర్ పాత్రపై రెండు సన్నివేశాలు, సీనియర్ నటుడు జగపతి బాబుకు సంబంధించిన ఓ సీన్ ఉంటుందని ప్రకటించారు. కొత్తగా సీన్స్ యాడ్ చేసి పెద్దిని థియేటర్లలో రన్ చేయనున్నారు. కొత్త సన్నివేశాలు ఈ నెల 17 నుంచి అందుబాటులోకి వస్తాయని మేకర్స్ ప్రకటించారు. సక్సెస్ మీట్‌లో బుచ్చిబాబు మాట్లాడుతూ.. "మేము ఇప్పటికే ఎడిటింగ్ పూర్తి చేశాం. ఈ బుధవారం నుంచి కొత్త సీన్స్ జోడిస్తాం. మేము మొత్తం మూడు సన్నివేశాలను చేర్చాం. హీరోయిన్‌కు సంబంధించిన సన్నివేశాలు.. అలాగే జగపతి బాబు కోసం ఓ సీన్ ఉంటుంది. ఈ సన్నివేశాలు అచియ్యమ్మ పాత్రకు మరింత భావోద్వేగ లోతును తీసుకొస్తాయి. జాన్వీ పాత్ర మరో స్థాయికి చేరుకుంటుందని నమ్ముతున్నా" అని బుచ్చి బాబు సానా అన్నారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034